

ఈవీఎం గోడౌన్ పరిశీలన

నరసరావుపేట: జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ శ్రీకేష్ బి.లత్కర్ గురువారం మార్కెట్ యార్డులోని ఈవీఎం గోడౌన్‌లను రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి పరిశీలించారు.



విరాళం అందజేత

కోడూరు: నూతనంగా నిర్మిస్తున్న శివరామకృష్ణ క్షేత్రానికి జయపురం గ్రామానికి చెందిన గోగినేని సోమశేఖరరావు, లక్ష్మీపార్వతి దంపతులు రూ.1,01,116 నగదు విరాళంగా అందించారు.



నాసా కాంటెస్ట్‌లో ప్రతిభ

మచిలీపట్నంటౌన్: స్థానిక భాస్కరపురం శ్రీ చైతన్య స్కూల్ విద్యార్థులు నాసా కాంటెస్ట్‌లో జాతీయ స్థాయి ప్రథమ బహుమతిని పొందినట్లు ప్రిన్సిపాల్ ఒడుగు శంకరరావు తెలిపారు.

న్యూస్‌రీల్

14వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయించాలి

మంత్రి పవన్ కళ్యాణ్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ వినతి



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా ప్రజా పరిషత్‌కు 15వ ఆర్థిక సంఘ నిధులు విడుదల చేయించాలని డెప్యూటీ సీఎం, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి–పంచాయతీరాజ్ శాఖమంత్రి కొణిదెల పవన్‌కల్యాణ్‌కు జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గురువారం పవన్ కల్యాణ్‌ను మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో కలిసిన హెనీ క్రిస్టినా వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్‌లో దీర్ఘకాలికంగా నెలకొన్న సమస్యలను పవన్ దృష్టికి తీసుకెళ్లారు. జెడ్పీ నూతన భవన నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. త్వరలో జరగనున్న జెడ్పీ సర్వసభ్య సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఆహ్వానించారు. విజ్ఞప్తులపై పవన్‌కల్యాణ్ సానుకూలంగా స్పందించినట్లు హెనీ క్రిస్టినా తెలిపారు. పవన్‌ను కలిసిన వారిలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కత్తెర సురేష్ కుమార్ ఉన్నారు.

మంగళగిరిలో 24.2 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లాలో బుధవారం ఉదయం నుంచి గురువారం ఉదయం వరకు పలుచోట్ల వర్షం కురిసింది. అత్యధికంగా మంగళగిరి మండలంలో 24.2 మిల్లీమీటర్లు వర్షం పడగా, అత్యల్పంగా వట్టిచెరుకూరు మండలంలో 4.8 మి.మీ. పడింది. సగటున 15 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాలవారీగా గుంటూరు పశ్చిమ 22.2 మి.మీ., తాడికొండ 22, తాడేపల్లి 19.6, దుగ్గిరాల 18.6, తుళ్లూరు 18.6, తెనాలి 18.4, కొల్లిపర 17.4, ఫిరంగిపురం 15.8, పెదకాకాని 15.6, పొన్నూరు 15.2, గుంటూరు తూర్పు 13.4, కాకుమాను 10, మేడికొండూరు 9.6, చేబ్రోలు 9.4, పెదనందిపాడు 8.2, ప్రత్తిపాడు మండలంలో 6.8 మి.మీ. చొప్పున వర్షం పడింది. జూన్ 27వ తేదీ నాటికి సాధారణ వర్షపాతం 87.4 మి.మీ. నమోదుకావాల్సి ఉండగా, ఇప్పటి వరకు 106.1 మి.మీ. వర్షపాతం నమోదైంది.

యార్డులో 38,931 బస్తాల మిర్చి విక్రయం

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 31,128 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 38,931 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి రూ. 17,200 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,000 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,800 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 13,615 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

రేంజ్‌లో పలువురు ఎస్‌ఐలకు జిల్లాల కేటాయింపు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు రేంజ్‌లోని ఎస్‌ఐలను ఆయా జిల్లాలకు బదిలీ చేస్తూ గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికలలో భాగంగా రేంజ్‌లోని పలువురు ఎస్‌ఐలను ఎన్నికల కమిషన్ (ఈసీ) బదిలీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో గుంటూరు జిల్లా–15, పల్నాడు జిల్లా–7, బాపట్ల –7, ప్రకాశం జిల్లా– 20, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా –13, తిరుపతి జిల్లాలో ఆరుగురు ఎస్‌ఐలు బదిలీ అయ్యారు.

నులకపేట–బ్రహ్మానందపురం గేటు మూసివేత

లక్ష్మీపురం(గుంటూరు వెస్ట్): మంగళగిరి–కృష్ణా కెనాల్ మధ్య నులకపేట బ్రహ్మానందపురం మధ్య లెవెల్ క్రాసింగ్ గేటును ఈనెల 28న ఉదయం 7 గంటల నుంచి ఈనెల 30 సాయంత్రం 7 గంటల వరకు మూసి వేయనున్నట్టు సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ గురువారం వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఓవర్ హాలింగ్ రోడ్డు మరమ్మతుల కోసం మూడు రోజుల పాటు గేటు మూసి వేయనున్నట్లు వివరించారు. స్థానికులు, వాహనదారులు సహకరించాలని ఆయన కోరారు.

జల సిరులకు భరోసా

- వాన నీటిని ఒడిసి పట్టడానికి చక్కని మార్గం
- ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లో ప్రయోజనం
- భూగర్భ జలాల పెంపునకు దోహదం



ఇంకుడు గుంత పై భాగం



ఇంకుడు గుంత లోపలి భాగం

గుంటూరు ఈస్ట్: మనిషి ఆహారం లేకపోయినా కొన్ని రోజులు బతకవచ్చు. కానీ నీరు లేకపోతే ఎక్కువ రోజులు మనుగడ సాగించలేడు. మనిషికి రోజూ వారి అవసరాలతో పాటు తాగడానికి, గృహ వినియోగానికి ముఖ్యంగా పంటలకు నీరు ఎంతో అవసరం. ఒకప్పుడు ఏడాదికి 1300 నుంచి 1500 మిల్లీమీటర్ల వరకు వర్షం సగటున కురిసేది. పచ్చదనం తగ్గడం, కాంక్రీట్ కట్టడాలు పెరగడం, కార్బన్ డయాక్సైడ్ శాతం పెరగడం వల్ల ప్రస్తుతం సుమారు 700 మిల్లీమీటర్ల నుంచి 800 మిల్లీమీటర్లే సగటు వర్షపాతం నమోదవుతోంది. స్వాతంత్ర్యానికి ముందు ఉన్న చెరువులు, కుంటల సంఖ్య ప్రస్తుతం సగానికి సగం తగ్గిపోయాయి. దీని వల్ల భూ ఉపరితలంపై నీరు నిలిచే పరిస్థితి తగ్గిపోయింది. చెరువులు, కుంటలు, నదులలో మట్టి మేట పెరిగి నీరు ఎక్కువ నిలిచే పరిస్థితులు లేవు. వర్షాకాలంలో ఎంత వాన కురిసినా ఫిబ్రవరి, మార్చి నుంచే జలాశయాల్లో నీరు అడుగంటిపోయి తాగు, సాగునీటికి ఇబ్బంది ఏర్పడుతోంది.

పాతాళానికి భూగర్భ జలాలు

నగరాలకు లక్షలాది మంది వలస రావడంతో నీటి వినియోగం పెరిగింది. దీంతోభూగర్భ జలాలు రోజు రోజుకు అడుగంటుతున్నాయి. ఈ కారణంగా 400 అడుగుల నుంచి వెయ్యి అడుగుల వరకు బోర్లు వేయాల్సిన దుస్థితి నెలకొంది. భూగర్భ జలాలు అడుగంటిపోవడం, వర్షాభావం వల్ల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి.

ప్రతి 500 గజాలకు ఒక గుంతతో ప్రయోజనం

నగరాల్లో నీటి సమస్యను అధిగమించాలంటే వాన నీటిని ఇంకుడు గుంతల ద్వారా మదుపు చేసి పొదుపుగా వాడుకోవాలి. కురిసిన ప్రతినీటి బొట్టునూ ఒడిసి పట్టాలి. ప్రతి ఇంటి యజమాని ఈశాన్య భాగంలో తొమ్మిది నుంచి 10 అడుగుల లోతు ఇంకుడు గుంత తవ్వి కింద నుంచి సిమెంటు వరలు వేసి వర్షపు నీరు దానిలోకి వెళ్లేలా నిర్మాణం చేపట్టాలి. ఇలా ఇంకిన వర్షపు నీరు భూపొరల్లోకి చొచ్చుకు వెళ్లి వడగట్టబడి బోరుద్వారా మళ్లీ వినియోగానికి వస్తుంది. ఇంకుడుగుంతల్లోకి కిచెన్, బాత్‌రూము నీటిని వదలకూడదు. ప్రతి 500 గజాల విస్తీర్ణానికి ఒక గుంత చొప్పున ఇంకుడు గుంతలు తవ్వాలి. దీని వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. బోర్లు ఎండాకాలంలోనూ ఎండిపోకుండా నీరు సంవృద్ధిగా ఉంటుంది. బోరు చుట్టూ ఇంకుడుగుంత ఏర్పాటు చేసుకోగలిగితే ఎంతో ఉత్తమం.

ఇంకుడు గుంత నిర్మాణం ఇలా..

పది అడుగుల లోతు, నాలుగు అడుగుల వ్యాసం ఉన్న ఇంకుడు గుంతలో అడుగు భాగాన 40 ఎం.ఎం. కంకరరాయి, మూడు అడుగుల మందాన వేయాలి. దానిపై ఒక అడుగు మందాన 20 ఎం.ఎం. కంకర పోయాలి. దానిపై ఒక అడుగు మందాన బేబి చిప్స్ పోయాలి. దానిపై ఒక్క అడుగు మందాన ఇసుక పరచాలి. ఇసుకపైన నాలుగు అడుగులు ఖాళీ వదిలి వాన నీటిని గుంతలోకి మళ్లించాలి. గుంతపైన చెత్తాచెదారం పడకుండా మూత ఏర్పాటు చేయాలి. రెండు సంవత్సరాల కొకసారి మూత తీసి మట్టితో కలిసిన ఇసుక తొలగించి కొత్త ఇసుక పోయాలి.

ఉచిత సలహాలకు సంప్రదించండి



నీరు లేనిదే ఈ భూమి మీద ఏ జీవీ మనుగడ సాగించలేదు. నీరు, చెట్టు పెంపుదలే లక్ష్యంగా అందరూ కృషి చేయాలి. ఇంకుడు గుంతల నిర్మాణంతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. వీటి నిర్మాణానికి ఉచితంగా సలహాలు అందిస్తాను. ఎలాంటి అనుమానాలు ఉన్నా.. నా సెల్ నంబర్ 98852 29289ను సంప్రదించండి

– చెలికాని సీతారామయ్య, గుంటూరు నగరపాలక సంస్థ ఇంకుడుగుంతల పర్యవేక్షకులు

బగళాముఖి అమ్మవారికి రూ.7,03,739 ఆదాయం



హుండీ కానుకలను లెక్కిస్తున్న భక్తులు

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలులో గల శ్రీ బగళాముఖి అమ్మవారి దేవాలయంలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. 159 రోజులకు గానూ రూ.7,03,739 లభించినట్లు ఈవో జి.నరసింహమూర్తి తెలిపారు. గతంలో కంటే ప్రస్తుతం రూ.1,43,100 అధికంగా వచ్చినట్లు చెప్పారు. గత నెలలో నెలలో జరిగిన అమ్మవారి తిరునాళ్లకు భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆదాయం పెరిగినట్లు పేర్కొన్నారు. కానుకల లెక్కింపులో బాపట్ల ఎండోమెంట్ అధికారి వి.శ్యామల, హెడీఎఫ్‌సీ పొన్నూరు బ్రాంచి మేనేజర్ రాజేష్, సతీష్, చందోలు పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ నాగలక్ష్మి, బిందు మాధవి, పెనుగొండ బాలకృష్ణమూర్తి, వక్కలగడ్డ ప్రసాద్ పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వద్దు



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్, అధికారులు

బాపట్ల: ఎన్టీఆర్ భరోసా పింఛన్ నగదును లబ్ధిదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్. శ్రీధర్ ఆదేశించారు. పింఛన్ పథకం అమలు తీరుపై జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన గురువారం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. తొలి రోజే నూరు శాతం నగదును పంపిణీ చేయాలని, సాంకేతిక కారణాలు ఎదురైతే రెండో తేదీన పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే పింఛన్ పంపిణీలో విధులు నిర్వర్తించాలని ఆయన స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగి 50 మందికి నగదు ఇచ్చేలా మ్యాపింగ్ చేయాలని చెప్పారు. ఒకటో తేదీ సోమవారం ఉదయం 6 గంటలకు నగదు పంపిణీ ప్రారంభించేలా అధికారులు ఏర్పాట్లు చేసుకోవాలని ఆయన సూచించారు. ఇందుకోసం 29వ తేదీన అన్ని ప్రాంతాలలో బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో 2,33,599 మంది లబ్ధిదారులకు గానూ 2,33,100 మంది ఇళ్లకు వెళ్లి అందజేయాలని, మిగిలిన వారికి నేరుగా పంపిణీ చేయాలని చెప్పారు. ఇందుకోసం జిల్లాకు రూ.157 కోట్ల నగదు విడుదలైందని వెల్లడించారు. ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. లబ్ధిదారుల బయోమెట్రిక్, ఐరిష్, ఉద్యోగుల ధ్రువీకరణతోనే నగదు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. పింఛన్ పంపిణీలో వలంటీర్ల జోక్యం ఉండరాదని, నిబంధనలు ఉల్లంఘించే ఉద్యోగులపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. లబ్ధిదారులకు మేలు జరిగే లక్ష్యంతోనే పని చేయాలని సూచించారు. జిల్లాలోని 477 సచివాలయాల్లో 4,307 మంది ఉద్యోగులు పని చేస్తున్నారని తెలిపారు. నగదు పంపిణీకి ఉద్యోగుల కొరత ఏర్పడితే ఏ శాఖ వారినైనా విధుల్లోకి తీసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ వై.పిచ్చిరెడ్డి, ఎల్‌డీ ఎం.శివకృష్ణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసులకు సత్వర పరిష్కారం

ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ఆయన గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ఈనెల 29న జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నామని చెప్పారు. ఇందులో రాజీ చేయదగిన క్రిమినల్, సివిల్ వివాదాలు, రోడ్డు ప్రమాదాలు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల్లో కోర్టు ఇచ్చిన నివేదిక, జిల్లా పరిధిలోని పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల ప్రకారం రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసుల్లో కక్షిదారులకు నోటీసులు జారీ చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఇరు పక్షాల వారికి కౌన్సెలింగ్‌తో పాటు జాతీయ లోక్ అదాలత్ గురించి అవగాహన కల్పించి వారి సమ్మతితో కేసులు పరిష్కరించాలని తెలిపారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. నోటీసులు అందిన కక్షిదారులు కేసుల్ని రాజీ మార్గంలో పరిష్కరించుకునేందుకు ముందుకు రావాలని ఆయన కోరారు. లోక్ అదాలత్ వల్ల కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగే శ్రమ, సమయం తగ్గడంతో పాటు డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఇరు పక్షాల మధ్య స్నేహపూరిత సంబంధాలు ఉంటాయని చెప్పారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసి, జాతీయ లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు అవగాహన కల్పిస్తున్నామని ఎస్పీ వివరించారు.

వినుకొండలో తీవ్ర విషాదం

- ఒకేరోజు మూడు వరుస ప్రమాదాలు
- మూడు కుటుంబాల్లో తీరని శోకం
- రక్తసిక్తమైన కర్నూలు – గుంటూరు జాతీయ రహదారి
- ప్రాణాలను హరిస్తున్న రోడ్డు ప్రమాదాలు





తండ్రికొడుకుల మృతికి కారణమైన లారీ, వారి బైక్

వినుకొండ(నూజెండ్ల): నిదానమే ప్రధాన మన్నది పెద్దల మాట. కానీ ఇవాళ చోదకులు దాన్ని అస్సలు పట్టించుకునే స్థితిలో లేరు. తక్కువ సమయంలో గమ్యస్థానానికి చేరుకోవాలనే తాపత్రయం.. ఎక్కువ దూరం ప్రయాణం చేయడం వల్ల ఏర్పడిన అలసట, నిర్లక్ష్యం కారణంగా అనేక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. వారిమీద ఆధారపడిన కుటుంబాలు రోడ్డు పాలవుతున్నాయి. బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున వినుకొండ ప్రాంతంలో జరిగిన మూడు వరుస ప్రమాదాలను గమనిస్తే కేవలం చిన్నపాటి నిర్లక్ష్యమే ఆరుగురి ప్రాణాలు తీసిందన్నది అర్థమవుతోంది. ఈ ప్రమాదాలు మూడు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చాయి.

- చక్కగా దైవదర్శనాలు పూర్తి చేసుకుని మరో రెండు గంటల్లో తమ గమ్యస్థానానికి చేరుకోవాల్సిన ఓ కుటుంబ సభ్యుల వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొంది. తిరుమల తిరుపతి దేవస్థానంలో పురాణ పండితునిగా పేరుగడించి పదవీ విరమణ చేసి గుంటూరులో నివాసం ఉంటున్న సోమాసి బాల గంగాధర శాస్త్రి ఆయన భార్య యశోదతోపాటు కారు నడుపుతున్న డ్రైవరు కూడా సంఘటనా స్థలంలో మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో డ్రైవరు నిద్రమత్తు వల్లే వాహనం అదుపు తప్పి చివరకు అతని ప్రాణాలతోపాటు దంపతుల ఉసురు తీసింది.
- ఈ ప్రమాద స్థలానికి దగ్గరలోనే అతి వేగంగా వచ్చిన లారీ ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రకాశం జిల్లా ఉమ్మడివరం గ్రామానికి చెందిన తండ్రికొడుకులు మాలెపాటి పెద రామకోటేశ్వరరావు, ఆయన చిన్నకుమారుడు అంజిబాబులు అసువులు బాశారు. వీరిని లారీ మృత్యువు రూపంలో వెంటాడటం బాధాకరం.
- మరో ఘటనలో నూజెండ్ల మండలం పాతనాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన యువకుడు మీరావలిని మినీలారీ ఢీకొట్టింది. దీంతో ఆ యువకుడు రహదారిపైనే మృతిచెంది కుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చాడు.

నెత్తురోడుతున్న రహదారి..

గుంటూరు–కర్నూలు జాతీయ రహదారిపై ఏడాది వ్యవధిలోనే పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కోకొల్లలు. ప్రమాదాల నివారణకు పోలీసులు ప్రమాద సూచికలు ఏర్పాటు చేసినప్పటికీ తరచూ రాత్రి వేళల్లో ప్రమాదాలు జరుగుతుండటం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారింది.

ముఖ్యంగా జాతీయ రహదారి నుంచి శివాపురం నడిగడ్డ వెళ్లే మార్గం వద్ద ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అలాగే చీకటీగలపాలెం వై.జంక్షన్, కొత్తపాలెం వద్ద మూల మలుపులు, మార్కాపురం రోడ్డులోని పసుపులేరు మూలమలుపు వద్ద ప్రమాదాల తీవ్రత ఎక్కువగా ఉంది. ఈ మార్గంలో రాత్రివేళల్లో పెట్రోలింగ్ నిర్వహించడం, ప్రమాదాలపై అవగాహన కల్పించడం వంటి కార్యక్రమాలతోపాటు, ప్రమాదాల నివారణకు జిల్లాపోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుంటే బాగుంటుందని పలువురు సూచిస్తున్నారు.

డయేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు

జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డి.వెంకటేశ్వర్లు

బాపట్ల: డయేరియా నిర్మూలనకు ఆరోగ్యశాఖ ప్రత్యేక చర్యలు తీసుకుందని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని వెదుళ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల వారీగా డయేరియా కేసుల్ని గుర్తించాలని వైద్య సిబ్బందికి సూచించారు. మందులతో పాటు ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్‌లెట్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా డయేరియా కేసులపై నివేదిక తయారు చేయాలని చెప్పారు. డాక్టర్ల సూచనల మేరకు రెండు నెలల నుంచి ఆరు నెలల పిల్లలకు అర ట్యాబ్లెట్, ఆరు నెలల నుంచి ఐదు సంవత్సరాల పిల్లలకు ఒక జింక్ ట్యాబ్లెట్ ఇవ్వాలని సూచించారు.0–5 సంవత్సరాల వయస్సు కలిగిన వారికి జులైలో జరగబోయే ఐడీసీఎఫ్ క్యాంపులో ఓఆర్ఎస్, జింక్ ట్యాబ్లెట్లు ఇవ్వాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే సౌజన్య, ప్రాథమిక వైద్యాధికారిణి డాక్టరు వైష్ణవీకృష్ణ, సీహెచ్‌వో నాగేశ్వరరావు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈల పాత్ర కీలకం

జిల్లా పరిశ్రమల అధికారి రామకృష్ణ



వేటపాలెం: జిల్లా అభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈల పాత్ర కీలకమని బాపట్ల జిల్లా పరిశ్రమల అధికారి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ పొట్టిసుబ్బయ్యపాలెం రోడ్డులో గల క్రిస్టల్ సీఫుడ్స్ ఫ్యాక్టరీలో జిల్లా పరిశ్రమల శాఖ అధ్వర్యంలో అంతర్జాతీయ సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమల వేడుకలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఎంఎస్‌ఎంఈల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాల గురించి వివరించారు. ఎంఎస్‌ఎంఈలు స్టార్టప్‌లుగా ఎదగాలని సూచించారు. ప్రాజెక్ట్ వివరాలు, నైపుణాభివృద్ధి, ఆర్థిక పరమైన అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ డైరెక్టర్ సయ్యద్ వసీం మాట్లాడుతూ మినిస్ట్రీ ఆఫ్ ఎంఎస్‌ఎంఈల సహకారంతో బ్యాంక్ రుణాలు పొంది అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించామని తెలిపారు.

కేఎల్‌యూలో నీటి యాజమాన్యంపై శిక్షణ



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కేంద్ర జలశక్తి బోర్డు అధికారులు, కేఎల్‌యూ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లి రూరల్ : మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో గురువారం నీటి యాజమాన్యంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ విభాగ డీన్ డాక్టర్ వి. రాజేష్‌లు మాట్లాడుతూ నీటి యాజమాన్య పద్ధతుల గురించి సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యూనిట్ – విశాఖపట్నం ఆధ్వర్యంలో కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భూగర్భ జలాలు రానున్న కాలంలో ఎంతో అవసరమని అన్నారు. కేంద్ర భూగర్భ జలాల బోర్డు పేరిట జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని జాతీయ సంస్థ హయాంలో భూగర్భ జలాల అన్వేషణ, అభివృద్ధి, నియంత్రణ, నిర్వహణ ఉంటుందని తెలిపారు. మేరా యువ భారత్‌లో భాగంగా సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు ద్వారా విద్యార్థులకు నీటి రంగానికి సంబంధించిన పరిచయం కోసం శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణలో భాగంగా భూగర్భ జలాలు, నాణ్యత, సమస్యలు, సవాళ్లు, జాతీయ ఆక్విఫర్ మ్యాపింగ్, నిర్వహణకు సంబంధించిన అంశాల గురించి శిక్షణ ఏర్పాటు చేశామని తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు, దక్షిణ క్షేత్రం ప్రాంతీయ డైరెక్టర్ జి. కృష్ణమూర్తి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ టి.కె. రామకృష్ణారావు, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి. పోలరాజు, అసోసియేట్ డీన్ కె.జె. బ్రహ్మాచారి, విశాఖపట్నంలోని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డు స్టేట్ యూనిట్ ఆఫీసులో ఆఫీసర్ ఇన్‌ఛార్జి రవికుమార్ గుమ్మా పాల్గొన్నారు.

ఇద్దరికి ఐదేళ్ల జైలుశిక్ష

- మహిళను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో చీరాల అడిషనల్ సెషన్ కోర్టు తీర్పు

వేటపాలెం: మహిళను ఆత్మహత్యకు ప్రేరేపించిన కేసులో నిందితులకు చీరాల అడిషనల్ సెషన్ కోర్టు జైలుశిక్ష విధించింది. ఎస్పీ కార్యాలయ వివరాల మేరకు.. వేటపాలేనికి చెందిన దిడ్ల శివనాగమణి, ఆసోది శ్రీనివాసరెడ్డిలకు ఐదేళ్ల జైలుశిక్ష విధిస్తూ గురువారం జడ్జి ఎం. సుధ తీర్పు ఇచ్చారు. 2016 డిసెంబర్ 6న వేటపాలెం రెడ్ల బజారుకు చెందిన కంజుల మహేష్‌కు నిందితులు రూ.15 లక్షలు అప్పు ఇవ్వాల్సి ఉంది. అతడితో పాటు తల్లి కంజుల అంజమ్మ కలసి డబ్బులు అడగడానికి నిందితుల ఇంటికి వెళ్లారు. దీంతో ఇద్దరూ వారిని అసభ్యంగా తిట్టి, చీర కొంగు లాగి అవమానించి దాడి చేశారు. దీంతో అవమానం భరించలేక కంజుల అంజమ్మ ఇంటికి వచ్చి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించిండంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకెళ్లారు. పొన్నూరు పద్మావతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదే రోజు రాత్రి మృతి చెందింది. దీనిపై మృతురాలి కుమారుడు కంజుల మహేష్ వేటపాలెంలో పోలీసు స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చీరాల అడిషనల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి ఎం. సుధ మహిళ మరణానికి కారణమైన నేరస్తులు ఇద్దరికీ ఐదేళ్ల జైలుశిక్ష, చెరో రూ. 8 వేలు జరిమానా విధించారు. నిందితులకు శిక్ష పడేలా చేసిన వేటపాలెం ఎస్‌ఐ జి. సురేష్, పోలీసు అధికారులను, ఏపీపీని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

నేటి నుంచి జాతీయస్థాయి సదస్సు

మధురానగర్(విజయవాడ సెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ కళాశాలలో రెండ్రోజుల పాటు ఏర్పాటు చేసిన జాతీయ స్థాయి సదస్సును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల విద్య కమిషనర్ డాక్టర్ పోలా భాస్కర్ సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి సెమినార్ బ్రోచర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజన పెంపునకు సెమినార్లు దోహదపడతాయన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రెండు రోజుల పాటు మ్యాథమెటికల్ మెథడ్స్ మోడల్స్ అండ్ అప్లికేషన్స్ ఇన్ మల్టీ డిసిప్లినరీ రీసెర్చి అండ్ ఆక్వాకల్చర్ ఫ్రమ్ జీనియస్ టు ఎకోసిస్టమ్ అంశంపై జాతీయ స్థాయి సెమినార్ నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో పలు ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్లు, శాస్త్రవేత్తలు వక్తలు పాల్గొంటున్నారని తెలిపారు.

క్లుప్తంగా

ఏడీఏగా నాంచారయ్య బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: పశుసంవర్ధకశాఖ రేపల్లె డివిజన్ సహాయ సంచాలకులుగా బెల్లంకొండ నాంచారయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా రాయదుర్గం నుంచి బదిలీపై ఆయన వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న నరేంద్రబాబు తెనాలికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన నాంచారయ్య మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పశుపోషకులకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందిస్తామని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి గానూ ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలను రైతులకు సక్రమంగా చేరేలా పని చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా నాంచారయ్యకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు.

వాహనం ఢీకొని వ్యకి మృతి

మరొకరికి గాయాలు



తీవ్రంగా గాయపడిన కార్తిక్

అద్దంకి రూరల్: బైకుపై వెళుతున్న తండ్రీకొడుకుల్ని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తండ్రి అక్కడికక్కడే మృతి చెందిన ఘటన గురువారం అద్దంకి పట్టణంలో చోటు చేసుకుంది. ఎస్ఐ నాగరాజు తెలిపిన సమాచారం మేరకు... అద్దంకి పట్టణంలోని గుర్రాల కాలనీకి చెందిన గజ్జల సుబ్బుడు (33) కుమారుడు కార్తిక్‌ను ఎక్కించుకుని బైక్‌పై అద్దంకి– నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై స్థానిక భవానీ సెంటర్ వైపు వెళుతున్నారు. ఈ సమయంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో గజ్జల సుబ్బుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కార్తిక్‌కు తీవ్ర గాయాలవడంతో 108 వాహనం ద్వారా తొలుత అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సుబ్బుడు మృతదేహాన్ని అద్దంకి వైద్యశాలలో పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

బాపట్ల టౌన్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని స్టువర్టుపురంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన దేవర ప్రకాశరావు(48) చీరాల నుంచి వస్తుండగా, అదే సమయంలో వెనుక చీరాల నుంచి బాపట్ల వైపు ద్విచక్ర వాహనంపై మరో వ్యక్తి వస్తున్నాడు. ప్రకాశరావు ఒక్కసారిగా స్టువర్టుపురం వైపు వాహనాన్ని తిప్పడంతో వెనుక నుంచి వస్తున్న వ్యక్తి ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రకాశరావును బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు వెదుళ్లపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జీవన ఎరువు.. భూములకు ఆదరువు

- తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు
- భూములలో రసాయన సమతుల్యం మెరుగు
- అమరావతి పరిశోధన స్థానంలో అందుబాటులో ఎరువులు

అమరావతి: ప్రస్తుతం వ్యవసాయ రంగంలో జీవన ఎరువుల ప్రాధాన్యం పెరిగింది. పంట భూములలో సహజంగా ఉండే మిత్ర సూక్ష్మజీవ సంపదను కాపాడుకుంటూ భూమిని ఆరోగ్యంగా ఉంచేందుకు అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా ఐదు రకాల జీవన ఎరువులను ఘన, ద్రవరూపాలలో శాస్త్రవేత్తలు రైతులకు అందిస్తున్నారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నేతృత్వంలో జీవన ఎరువుల తయారీలో అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దారు. దీనికి అనుబంధంగా అనకాపల్లి, అనంతపురం, కడప, తదితర ప్రాంతాలలో కూడా పరిశోధన స్థానాలు ఏర్పాటు చేశారు.

జీవన ఎరువుల ఉపయోగాలు

వ్యవసాయంలో అధిక రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం వల్ల భూమిలో, ఉపరితలం పైనా పర్యావరణ కాలుష్యంతో పాటు రైతులకు పెట్టుబడి అధికమవుతుంది. ఈ నేపథ్యంలో సమన్వయసమగ్ర భూసార పరిరక్షణా పద్ధతుల్ని రైతులు మరిచారు. సేంద్రియ ఎరువులు, జీవన ఎరువుల వాడకం కూడా తగ్గుముఖం పడుతున్నందువల్ల భూమిలో రైతుకు మేలు చేసే సూక్ష్మాంగ జీవులు తగ్గిపోతున్నాయి. మొక్కకు పోషక పదార్థాలు, హార్మోన్‌లను సమకూర్చే వీలులేకుండా పోతుంది. జీవన ఎరువులు వాడటం వల్ల అనుగుణమైన మార్పులు జరిగి రైతుకు మేలు చేసే మిత్ర సూక్ష్మజీవుల సంఖ్య అనూహ్యంగా పెరుగుతుంది. మొక్కకు అవసరమైన వివిధ పోషకాలతో పాటు హార్మోన్లను,విటమిన్‌లను అందించేందుకు వీలు కలుగుతుంది. జీవన ఎరువులలో నత్రజనిని స్థిరీకరించే ఏడు రకాల జీవన ఎరువులలో అమరావతి వ్యవసాయ పరిశోధనా స్థానంలో ఐదు రకాల జీవన ఎరువులను ద్రవ, ఘనరూపాలలో తయారు చేసి రైతులకు అందిస్తున్నారు. అందులో రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, పాస్ఫోబ్యాక్టీ రియా,మైకోరైజావేమ్ లను తక్కువ ధరకు అందిస్తున్నారు.



వ్యవసాయ పరిశోధన స్థానం భవనం



సిద్ధంగా ఉన్న ఘన, ద్రవ జీవన ఎరువులు

రైజోబియం

అపరాల పంటలకు నత్రజని అందించే జీవన ఎరువుగా వాడాలి. పప్పుజాతి పైర్లలో కంది, పెసర, మినుము, శనగ, వంటి పైర్లకు, వేరు శనగ, సోయాచిక్కుడు వంటి నూనెగింజల పైర్లకు రైజోబియం కల్చర్‌ను విత్తనానికి పట్టించి ఉపయోగించాలి. దీనిని వల్ల మొక్క వేళ్లపై ఏర్పడిన లేత గులాబిరంగు బుడిపెలలో ఉన్న రైజోబియం గాలిలోని నత్రజనిని స్థిరీకరించి మొక్కలకు అందిస్తుంది. ఈ రైజోబియం కల్చర్ ఒక్కొక్క పంటకు ఒక్కొక్క ప్రత్యేకమైన స్ట్రెన్ ఉంటుంది. రైజోబియంను 100 మిల్లీ లీటర్ల నీటిలో 10 గ్రాముల పంచదార లేదా బెల్లం లేదా గంజి పౌడర్‌ను కలిపి 10 నిమిషాలు మరగబెట్టి చల్లార్చాలి. ఈ ద్రావణాన్ని 10 కిలోల విత్తనాలపై చల్లి దానిపై 200 గ్రాముల రైజోబియం కల్చర్ పొడిని బాగా కలియబెట్టి విత్తనం చుట్టు పొరలా ఏర్పడే విధంగా చూడాలి. తరువాత విత్తనాన్ని 10 నిమిషాలు నీడలో ఆరబెట్టి పొలంలో నాటుకోవాలి.

అజిటోబాక్టర్

పప్పుజాతి పంటలను మినహాయించి మిగతా అన్ని పంటలకు నత్రజని జీవన ఎరువుగా ఉపయోగపడుతుంది. ఈ బ్యాక్టీరియా నత్రజనిని స్థిరీకరించటమే కాకుండా మొక్కకు కావాల్సిన హార్మోన్లను, విటమిన్లను అందిస్తుంది. దీనివల్ల ముఖ్యంగా సేంద్రియ కర్బనం ఎక్కువగా భూమిలో సమర్థంగా పనిచేస్తుంది. ఈ జీవన ఎరువును ఆకుకూరలు, కూరగాయలు, పూల తోటలలో అధికంగా వాడతారు. ఏ పంటకైనా ఒక కిలో కల్చర్‌ను 200 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి విత్తనం నాటే సమయంలో ఒక ఎకరాకు చల్లాలి. ఈ సమయంలోగాని, లేక వెనువెంటనే గాని భూమిలో తగినంత తేమ ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి.

అజోస్పైరిల్లమ్

గతంలో కంటే ఇటీవల అజోస్పైరిల్లమ్ ప్రాముఖ్యతను రైతులు గుర్తించారు. ఈ బ్యాక్టీరియా మొక్క వేర్ల చుట్టూ పెరుగుతూ అవకాశం ఉన్న చోట వేళ్లలో కూడా జీవిస్తాయి. ఈ కారణంగా ఈ జీవన ఎరువు స్థిరీకరించిన నత్రజని నేరుగా మొక్కకు అధికశాతం అందుబాటులో ఉంచుతుంది. ఈ జీవన ఎరువు పప్పుజాతి పంటలకు తప్పించి మిగిలిన పంటలకు వాడుకోవచ్చు. వరి, చెరకు, పత్తి, మిర్చి, జొన్న, సజ్జ, పొద్దు తిరుగుడు, అరటి మొదలైన పంటలలో సేంద్రియ పదార్థం తక్కువగా ఉన్నప్పటికి ఈ జీవన ఎరువు పనిచేస్తుంది. తక్కువ కాలపు పంటలకు ఒక కిలో అజోస్పైరిల్లమ్‌ను 80–100 కిలోల సేంద్రియ ఎరువుతో కలిపి ఎకరం పొలంలో విత్తనం కిందపడేటట్లు చల్లాలి. నారుమడి వేసుకునే పంటలకు పీకడానికి ముందుగా నారుమడి వద్ద 70 నుంచి 80 లీటర్లు పట్టే చిన్న మడి తయారు చేసుకోవాలి. ఆ నీటిలో ఒక కిలో అజోస్పైరిల్లాను బాగా కలిపి కలిపిన ద్రావణంలో పదినిమిషాలు వేళ్లను మాత్రమే ముంచి వెంటనే నాటుకోవచ్చు. చెరకు పంటలో నాటే విత్తనం ముచ్చులను పది నిమిషాల పాటు ఈ ద్రావణంలో ముంచి నాటుకోవాలి.

ఫాస్ఫోబాక్టీరియా

ఈ జీవన ఎరువు ముఖ్యంగా బాసిల్లస్ మెగథీరియంతో గాని, సూడోమోనాస్‌గాని ఉపయోగించి తయారు చేస్తారు. ఈ జీవన ఎరువు భూమిలోని మొక్కలకు లభ్యం గాని రూపంలో ఉన్న భాస్వరాన్ని, లభ్యమయ్యే రూపంలోకి మార్చును. అన్ని పంటలకు వాడుకోవచ్చు. ఈ జీవన ఎరువు సమర్థంగా పనిచేయడానికి సేంద్రియ కర్బనం అత్యవసరం. ఈ ఎరువుతో తప్పనిసరిగా సేంద్రియ ఎరువు వాడాలి. దీంతో అధిక పంట దిగుబడి సాధ్యం. ఎకరాకు ఒకటి నుంచి 1.5 కిలోల ఫాస్ఫోబాక్టర్, 200 కిలోల పశువుల ఎరువుతో కలపి దుక్కిలోగాని, మొక్క నాటినప్పుడు గాని సాళ్లలో పడేటట్లు వేసుకోవాలి. వరి విషయంలో నాట్లు వేసిన 3 నుంచి ఏడు రోజుల వ్యవధిలో వేసుకోవాల్సి ఉంటుంది. ఎరువులు వాడే సమయంలో పొలంలో తగినంత తేమ అవసరం.

మైకోరైజావేమ్

ఈ మైకోరైజాల్ ఇనాక్యులమ్‌ను ఏదైనా సేంద్రియ ఎరువుతో కలపి విత్తనం లేదా మొక్క వేళ్లకు కింద పడేట్లు జాగ్రత్త తీసుకోవాలి. ఒక ఎకరం పొలానికి సుమారు ఐదు కిలోల కల్చర్‌ను వాడాల్సి ఉంటుంది. ఇది మొక్కకు కావాల్సిన భాస్వరాన్ని సమృద్ధిగా అందిస్తుంది. సూక్ష్మధాతువులైన జింక్, మాంగనీసు, ఐరన్, కాపర్, కోబాల్ట్ మరియు మోలిబ్డినమ్ మొదలగు వాటిని ఉత్పత్తి చేస్తుంది. పంట నీటి ఎద్దడి నుంచి తట్టుకోవటానికి దోహదపడుతుంది. పంటను సులిపురుగులు, రోగ నిరోధక శిలీంద్రాల నుంచి రక్షణ ఇస్తుంది. భూమిలో సేంద్రియ కర్బనం పెరగటానికి ఉపయోగపడుతుంది. ఈ జీవన ఎరువు పాక్షిక స్టెరైల్ పద్ధతిలో లిగ్నైట్, మెత్తటి ఇసుక మిశ్రమంతో తయారు చేస్తారు. దీనిని ఎండ తగలని, నీడ ప్రదేశంలో నిల్వ చేయాలి. రసాయనిక ఎరువులతో కలిపి వాడరాదు. నేలలో తగినంత తేమ ఉన్నప్పుడు మాత్రమే వాడాలి.

వాడకంలో జాగ్రత్తలు

జీవన ఎరువు ప్యాకెట్లను వేడి తగలని నీడ ప్రదేశంలో నిల్వ ఉంచాలి. పంటకు సరైన జీవన ఎరువును ఎంపిక చేసుకోవాలి. గడువు తేదీని గమనించి వాడాలి. రసాయనాలతో విత్తనశుద్ధి చేసేటప్పుడు తప్పక 48 గంటల వ్యవధిలో వాడాలి. రసాయన ఎరువులతో కలిపి వాడరాదు. సేంద్రియ ఎరువుతో జీవన ఎరువును కలిపి వెంటనే పంటకు వాడుకోవాలి.

సబ్సిడీ ధరకే జీవన ఎరువులు

రైతులకు అవసరమైన జీవన ఎరువులను సబ్సిడీ ధరలకే అందిస్తున్నాం. ఈ ఖరీఫ్, రబీ సీజన్‌లలో సుమారు ఏడు వేల లీటర్లకు పైగా ద్రవ జీవన ఎరువులు రైతులకు అందించాలని నిర్ణయించాం. వివరాలకు వ్యవసాయ పరిశోధనా స్థానం, అమరావతి–522020, గుంటూరు జిల్లా ఫోన్‌నెం.08645 255345లో సంప్రదించాలి.

–ఎం.శ్రీరేఖ, ప్రిన్సిపాల్ శాస్త్రవేత్త, అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం

ద్రవజీవన ఎరువులు

రాష్ట్రంలోనే ప్రత్యేకత కలిగిన అమరావతి వ్యవసాయ పరిశోధన స్థానం నుంచి ఉత్పత్తి చేస్తున్న జీవన ఎరువులు రైతులకు అందుబాటులోకి వచ్చాయి. ప్రస్తుత ఈ పరిశోధనా స్థానం నుంచి మార్కెట్‌లో రైజోబియం, అజటోబాక్టర్, అజోస్పైరిల్లమ్, పాస్ఫోబ్యాక్టీరియా, మైకోరైజావేమ్ అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు ఇక్కడ నుంచి పొడి రూపంలో అందించే ఈ జీవఎరువుల కాలపరిమితి 6 నెలలకు మించి నిల్వ ఉండే పరిస్థితి లేకపోవటంతో గతంలో కంటే నాణ్యంగాను, ఎక్కువకాలం నిల్వ ఉండేలా ద్రవరూపంలో అందిస్తున్నారు. ద్రవ జీవన ఎరువుల వల్ల రైతులకు అనేక లాభాలు ఉన్నాయి. ద్రవజీవన ఎరువులు సంవత్సరం కాలంపాటు నిల్వ ఉండి అధికశాతం బ్యాక్టీరియాను గడువు తేదీ వరకు కలిగి ఉంటాయి.

జీవన ఎరువు వాడకం వల్ల ఉపయోగాలు

వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చు,వాతావరణంలోను, నేలలోను మొక్కలు తమంత తాము ఉపయోగించు కోలేని పోషకాలను అందుబాటులోకి తెస్తాయి. హార్మోన్లు, విటమిన్లు మొక్కకు లభ్యమయ్యే పెరుగుదల వేగంగాను, ఆరోగ్యకరంగాను ఉంటాయి. నేల నుంచి సంక్రమించే తెగుళ్లను కొంతమేర నివారించవచ్చు. నేల భౌతిక లక్షణాలు బాగుపడి భూసారం అభివృద్ధి చెందుతుంది. రైతులకు రసాయన ఎరువుల ఖర్చు తగ్గి లాభాల నిష్పత్తి పెరుగుతుంది. సాధారణ దిగుబడుల కంటే 10 నుంచి 20 శాతం వరకు పెరుగుతాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది.

పట్టపగలే బంగారం చోరీ

- అన్నంబొట్లవారిపాలెంలో ఘటన
- రెండు సవర్ల బంగారం, మూడు కిలోల వెండి, నగదు అపహరణ

చినగంజాం (పర్చూరు): ఇంట్లో ఎవరూ లేని సమయంలో పట్టపగలే చోరీ చేసిన ఘటన పర్చూరు మండలం అన్నంబొట్లవారిపాలెంలో గురువారం జరిగింది. ఎస్ఐ రమేష్ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మర్రి జానకి అమెరికాలో కుమారుడి వద్దకు వెళ్లారు. ఈనెల 9వ తేదీన అక్కడకు వెళుతూ రోజూ ఇల్లు శుభ్రం చేయమని పని మనిషికి తాళాలు ఇచ్చారు. రోజు మాదిరిగానే శుభ్రం చేయడానికి వచ్చిన ఆమె ఇంటి తలుపులు తీసి ఉండటం చూసి ఒక్కసారిగా ఆశ్చర్యపోయింది. లోనికి వెళ్లి చూసే సరికే బీరువా తలుపులు తీసి ఉండటాన్ని గమనించి లబోదిబోమంది.

వెంటనే బయటికి వచ్చి ఇరుగుపొరుగు వారిని పిలిచి విషయం చెప్పింది. సమాచారం అందుకున్న పర్చూరు ఎస్ఐ రమేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీంలను పిలిపించి ఆధారాలు సేకరించారు. అమెరికాలో ఉన్న మర్రి జానకికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని చెప్పారు. ఆమె వద్ద నుంచి వివరాల్ని సేకరించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు రెండు సవర్ల బంగారం వస్తువులు, మూడు కిలోల వెండి, రూ.20 వేల నగదు అపహరణకు గురైనట్లు ఎస్ఐ రమేష్ నిర్ధారించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

బాపతు శ్రీనివాసరెడ్డి మృతి తీరని లోటు





భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు తదితరులు

భౌతికకాయం వద్ద ఎమ్మెల్సీలు లేళ్ల, మర్రి నివాళులు

గుంటూరు రూరల్: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ బాపతు శ్రీనివాసరెడ్డి బుధవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మరణించారు. ఆయన భౌతికకాయాన్ని శాసన మండలి సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జెడ్పీటీసీ సభ్యులు కృష్ణారెడ్డి, గట్టు విజయ్‌కుమార్, సర్పంచి పరమారెడ్డి, నూనె ఉమామాహేశ్వరరెడ్డి, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఉద్దగిరి మురళి, ఓం ప్రకాష్, మూలే శ్రీనివాసరెడ్డి, లక్ష్మారెడ్డి, ఫ్రాన్సిస్, రాజశేఖర్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు సందర్శించి నివాళులు అర్పించారు. శ్రీనివాసరెడ్డి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శ్రీనివాసరెడ్డి మృతి తీరని లోటని, ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని వివరించారు.

వైద్య రంగ సమస్యలపై నిర్మాణాత్మక పోరాటాలు

- ప్రభుత్వ ఆధీనంలోనే విద్య, వైద్యం ఉండాలి
- ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెరగాలి
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు



జీజీహెచ్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మహాసభలో పాల్గొన్న నేతలు

గుంటూరు మెడికల్: వైద్య రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిర్మాణాత్మక పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు చెప్పారు. ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ 18వ రాష్ట్ర మహాసభ గురువారం జరిగింది. గుంటూరు జీజీహెచ్‌లోని నాట్కో క్యాన్సర్ సెంటర్ సమావేశ మందిరంలో కోన అప్పారావు పేరుతో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణంలో మహాసభను ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో పాలకవర్గాల ఆలోచనా విధానాలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక వర్గాలకు వ్యతిరేకంగా ఉంటాయని విమర్శించారు. ఉద్యోగులు తమ సమస్యల కోసం పోరాటాలు చేస్తూనే సమాజ మార్పుకోసం కృషి చేయాలని సూచించారు. విద్య, వైద్య రంగాలు ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని, ఆయా రంగాలకు బడ్జెట్ కేటాయింపులు పెరగాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కోవిడ్ వంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచింది ప్రభుత్వ ఆధీనంలోని ఆసుపత్రులు, సిబ్బంది మాత్రమేనని కొనియాడారు. ఉద్యోగులు లేకుండా ప్రభుత్వాలు నడవడం కష్టతరమనే విషయాన్ని గ్రహించాలన్నారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమికి ప్రభుత్వ ఉద్యోగులు మద్దతు పలకడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఇంకా ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జంగాల అజయ్ కుమార్ మాట్లాడారు. అంతకుముందు జీజీహెచ్ ప్రధాన ద్వారం వద్ద ఉన్న ఏఐటీయూసీ జెండాను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య ఆవిష్కరించారు. అనంతరం యూనియన్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ జెండాను ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు వెలుగూరి రాధాకృష్ణమూర్తి ఎగురవేశారు.

సమావేశంలో ఎంప్లాయీస్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు వెలుగూరి రాధాకృష్ణమూర్తి, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది బంగారు గొలుసుల చోరీ

- షోరూం ఉద్యోగి పనే ● పోలీసులకు ఫిర్యాదు

గుంటూరు ఈస్ట్: తనిష్క్ బంగారు షాపులో తొమ్మిది బంగారు గొలుసులు చోరీకి గురైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని తనిష్క్ షోరూమ్‌లో ఇటీవల ఆడిట్ నిర్వహించారు. ఇందులో తొమ్మిది బంగారు గొలుసులు తగ్గాయి. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా షాపులో పనిచేసే వ్యక్తి 370 గ్రాముల బరువు ఉన్న తొమ్మిది బంగారు గొలుసులు చోరీ చేసినట్లు గుర్తించారు. స్టోర్ మేనేజర్ అరుణ్‌కుమార్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లను పటిష్టం చేయండి

సాంఘిక సంక్షేమ శాఖ మంత్రికి ఎమ్మెల్సీ లక్ష్మణరావు విజ్ఞప్తి



మంత్రి బాల వీరాంజనేయస్వామికి వినతి పత్రం సమర్పిస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లను పటిష్టం చేయాలని సాంఘిక సంక్షేమ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామికి ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు విజ్ఞప్తి చేశారు. వెలగపూడిలోని సచివాలయంలో గురువారం మంత్రిని కలిసిన లక్ష్మణరావు వివిధ అంశాలపై వినతిపత్రం సమర్పించారు. బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిళ్లను బలోపేతం చేసి, పోటీ పరీక్షల శిక్షణలను ప్రారంభించాలని కోరారు. గుంటూరులో అసంపూర్తిగా ఉన్న అంబేడ్కర్ భవన నిర్మాణాన్ని పూర్తి చేయడంతోపాటు డీఎస్సీ పరీక్షకు సన్నద్ధమవుతున్న ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత రెసిడెన్షియల్ శిక్షణ ప్రారంభించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించారని లక్ష్మణరావు వెల్లడించారు.

ఉపాధ్యాయుల పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలి



జెడ్పీ సీఈఓ వసంతరాయుడికి వినతి పత్రం సమర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీ పీఎఫ్ విభాగంలో ఉపాధ్యాయులకు సంబంధించి దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కె.బసవ లింగారావు డిమాండ్ చేశారు. జెడ్పీ కార్యాలయంలోగురువారం సీఈఓ ఎన్వీవీఎస్ వసంతరాయుడిని కలిసిన ఏపీటీఎఫ్ జిల్లా శాఖ నాయకులు వివిధ సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బసవ లింగారావు మాట్లాడుతూ ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుల తుది చెల్లింపుల బిల్స్ ప్రాసెస్ చేయకుండా నెలల తరబడి పెండింగ్ పెట్టి జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. దీంతోపాటు పలు సమస్యలను సీఈఓ దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిష్కరించాల్సిందిగా కోరారు. సీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, పూర్వ ప్రధాన కార్యదర్శి మద్దినేని హనుమంతరావు, జిల్లా కౌన్సిలర్ జాక్రియా అహమద్, డేవిడ్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

గుంటూరు రూరల్: ప్రత్తిపాడుకు చెందిన కమ్మ ప్రసాద్‌పై ప్రత్యర్థులు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచారు. స్థానికులు అతడ్ని చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆస్పత్రిలో వైద్యులు పరీక్షించి ప్రసాద్ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని తెలిపారు. గతంలో అతడు గ్రామంలో చెరువుకట్టపై ఆక్రమణలు తొలగించాలంటూ పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఘటనపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.